


# పనిమనిషి

రాఘవపురం జమిందారు గోవిందయ్యకి తన ఊళ్ళో మంచి మనసున్న వ్యక్తి ఎవరో తెలుసుకోవాలనిపించింది. వెంటనే తన సలహాదారు లక్ష్మణస్వామిని పిలిచి తన మనసులోని మాటని చెప్పి మంచి మనసున్న వ్యక్తిని తనకీ, సమాజానికీ చూపించవలసిన బాధ్యత అతనిదేనని చెప్పాడు. లక్ష్మణ స్వామి దానికి ఆనందంగా ఒప్పుకుని మరుసటి రోజు ఆ ఊళ్ళో అందరి ఇళ్ళలో పనిచేసే పని పనుషులని పిలిపించి ఒక చోటికి చేర్చాడు.

వాళ్ళని జమిందారు సమక్షంలో, వాళ్ళ వాళ్ళ యజమానులు, వారి కుటుంబ సభ్యులు ఎలా చూసుకుంటారు? అని అడిగాడు.

అందరూ తమ యజమానులు తమని రక్తమాంసాలున్న యంత్రాల్లా చూస్తారని, బానిసలకన్నా అధ్వాన్నంగా వాడుకుంటారని, కడుపునిండా తిండి పెట్టరని, కట్టుకోవడానికి సరైన బట్టలు కూడా ఇవ్వరని బాధపడుతూ, రోదిస్తూ చెప్పారు.

కొంత సేపటికి అక్కడికి కొద్ది దూరంలో కూర్చున్న ఓ మహిళ 'అయ్యా వీళ్ళందరి బాధలు వింటుంటే కడుపు తరుక్కుపోతోంది. నేను పని చేసేది వెంకయ్యఇంట్లో. ఆయన సాక్షాత్తూ దేవుడు. ఆయన కుటుంబ సభ్యులు

కూడా ఉత్తములు. నిజానికి వాళ్ళందరూ ఎవరి పని వారు చేసుకుంటారు. నాకు పనిచ్చినట్టుగా ఇచ్చి నా కుటుంబం నడవటానికి నాలుగు డబ్బులిస్తున్నారు. నన్ను వాళ్ళు పని మనిషిలా ఏనాడూ చూడలేదు. తమ కుటుంబ సభ్యురాలిగాచూసుకుంటారు. ఈ నాజన్మకి వాళ్ళు యజమానులుగా దొరకడం నా పూర్వజన్మ సుక్రుతం.మళ్ళీ జన్మంటూ ఉంటే ఆ మహానుభావుడింట్లోనే పనిమనిషనవ్వాలి. తిండికి, బట్టకి లోటు లేకుండా చూసే వాళ్ళ ఔదార్యం ఎన్ని జన్మలెత్తినా మర్చిపోలేనిది. వాళ్ళు పది కాలాలు చల్లగా ఉండాలి' అని దీవించింది.

'చూశారా జమీందారుగారు మనుషుల్లో మంచివాళ్ళెవరో తెలియాలంటే వాళ్ళ పని వాళ్ళని అడగాలి. వెంకయ్య నిస్సందేహంగా మంచి మనసున్న మనిషి' అన్నాడు లక్ష్మణస్వామి.

'అవునయ్యా, పద ఆ మానవుల్లో మాధవుడిని ఇప్పుడే చూసివద్దాం' అని బయల్దేరాడు గోవిందయ్య.

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాద్

## అమూల్య బాల్యం

ప్రతి మనిషి బాల్యం ఎంతో అమూల్యం!
అది దేవుడిచ్చిన దివ్యవరం
మహావృక్షానికి చిన్న విత్తనమే ముఖ్యం.
భావిజీతితానికిక్కూడా పునాది బాల్యం
అందుకే బాలలూ..!
పెద్ద చదువుల చదవాలి –
ఉన్నద పదవులు చేపట్టాలి –
నలుగురి మెప్పు పొందాలి!

– కాళ్ల గోవిందరావు,
ఆముదాలవలస